రాసి ఈనెలు తీసి చిలకలు చుట్టి అందిస్తు న్నాను. నేను ఆఖరాకు అందిస్తూ "అసలు ఇల్లెందుకు మూర్చానో చెప్పనాండీ?" అన్నాను. సన్నగా నవ్వుతూ.

ఆయన నవ్వారు. "ఎందు కేమిటీ?'

""పార్శ్వపు నొప్పికి భాస్కర లవణం." అన్నాను. మంచం మీద చోటు చేసుకు కూచుని. పొడుపు కథ పొడిచిన చిలిపి తనంతో.

"ఆదేమిటది?" అన్నా రాయన; నాచెయ్యి పట్టుకుని, గాజులు వెనక్కి ముందుకి సర్దుతూ.

"చెప్పుకోండి చూద్దాం!"

" ... ఏమిటి చెప్పుకోవడం! - వెన కెప్పుడో నాకు పార్శ్వపు నొప్పి వొస్తే అజీర్ణం మీద ఒచ్చిందని భాస్కర లవణం యిచ్చేరు ... దానిమాటేనా నువ్వు చెబు తున్నావ్?...దానికీ దీనికీ సంబంధమేమిటీ"

"అదే, చెప్పుకోవాలి మరి!"

"నువ్వే చెబుదూ నాకలా కలపడం చేత గాదు!"

"- చెప్ప మంటారా?...అక్కడ మీరు చిక్కి పోయారండీ. హోటలు మెతుకులూ, పని మనిషి చేతి నీళ్లూ...ఆర్నెల్లలో ఎంత మార్చేసిందండీ మిమ్మల్ని! ఛీ పాడు మనిషి!" అన్నాను. నవ్వుతూ. గోముగా ఆయన మీదికి వొంగుతూ.

మా ఆయన వొక్క నిమిషం మాట్లాడ కుండా వూరు కున్నారు. నేనూ ఊరు కున్నాను.

ఆయన లేచారు. కిటికీలోంచి తమల పాకుల విప్పి వుమ్మేసి. లైట్ ఆఫ్ చేసి మంచం మీద కూచున్నారు...

"అర్థంలేని అనుమానంవే పద్ధావుగాని తెలివి తేటలేమీ ఉపయోగించావుకాదు... నే నెలాటి వాణ్ణో తెలుసుకో లేక పోయా వన్న మాట. అసలలాంటివి నేను ఆలో చించుకోవాలే గాని-ఏదేనా అయితే నన్ను నువ్వు ఆప గలవనే అనుకున్నావా!'

అందులో నిజమెంతో. ఆయన మొహంలో భావం యెలాంటి దుందో తెలు సుకోవాలని. చూడాలనీ ఉంది నాకు...

కాని నేను లేచి దీపం వెయ్యలేదు. కనుక్కోవాలని నాకేం పట్టుదలా మేమిటి? నేను చీకట్లోనే నవ్వు కున్నాను. ●

## గుర్రుస్వామి


"బ్రదర్! రాత్రి నువ్వు తెగ గుర్రు పెట్టావోయ్!" అన్నాడు రూమ్‌మేటు.

"ఛా. అబద్ధం. నా కసలు ఎవరన్నా గుర్రుపెడుతుంటే నిద్ర పట్టదు తెలుసా?"



# అమోఘ వాక్కు

కొడవటిగంటి కుటుంబరావు



బ్రహ్మలోకం-వేదఘోష వినిపిస్తూ ఉంటుంది. సరస్వతీదేవి వీణమీద సరస్వతి రాగం ఆలాపన చేస్తూంటుంది.

నారదుడు : నారాయణ.... నారాయణ ...

సరస్వతి : (వీణ ఆపి) నారదుడు.

నార : తల్లిగారికి నమస్కారం.

సర : శుభమస్తు, నారదా. రా. కూచో. ఏ యే లోకాలు తిరిగి వస్తున్నావు? చాలా రోజులయింది నువు కనిపించి.

నార : నారాయణ. ఈసారి భూలోకంలో పెద్ద మజిలీ వేశానమ్మా.

సర : ఏమిటి విశేషాలు?

నార : ఎందు కడుగుతావు? మనుష్య జాతి పుచ్చి పురుగులుపడి పోతుంది. వాళ్ళ బుద్ధి వాళ్ళనే తినేస్తోంది. వాళ్లు సృష్టించు కున్న సమస్యల్లో వాళ్ళే మునిగి కొట్టుకు పోతున్నారు...నాన్నగారేరీ?

సర : భూలోకంలో నీకు కనిపించలా?

నార : (ఆశ్చర్యంగా) లేదే. ఆయన కక్కడ తొందరపనేం వచ్చిందీ?

సర : ఏవో కొత్త క్రిములు సృష్టించా

లని వెళ్లారు. రోగక్రిములా, విషక్రిములా? ఏదో చెప్పారు,

నార : (చిరాకుతో) నారాయణ. ఈయన ఒకటి చేసి ఒకటి చెయ్యకుండా వు[illegible]డా?

సర : (ఆందోళనగా) అదేం, నారదా? నాయన[illegible]గారి సృష్టిని ఎన్నడూ విమర్శించిన వాడివి కావే? ఈసారి—

నార : ఆ క్రిము లెందుకో తెలుసా? సృష్టి అంతం కావటానికి.

సర : (నవ్వి) వెర్రివాడా, ఆయన తన సృష్టిని తాను ఎన్నడూ చేజేతులా నాశనం చేసుకోరు. ఆయన సృష్టించిన జంతువులను శివుడు నాశనం చేసినప్పుడల్లా ఈయన వెళ్ళి అంతకంటె మంచి ప్రాణులను సృష్టించారు, తెలుసా?

నార : ఆ క్రిములతో సృష్టి అంతా ఎందుకు నాశనమవుతుందీ? మానవసృష్టి మాత్రమే.

సర : (ఆశ్చర్యంగా) మానవులను మాత్రం ఆయన నాశనం కానిస్తారా?

నార : అసలుకే ఎసరు వస్తే ఏం జేస్తాడు మరీ?

సర : నీమాటలు నా కర్థం కావటం లేదు, నారదా.

నార : నీకు విశ్వరాజకీయాలు తెలియ నట్టుంది, తల్లీ. నాయనగారికీ ఆ పరమ శివుడికీ ఒకవిధమైన ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతోంది. దాన్ని భూలోకంలో కోల్డ్ వార్ అంటున్నారు.

సర : (అదుర్దాగా) యుద్ధమే.?

నార : భయపడకు, తల్లీ. భయపడకు. ప్రచ్ఛన్న యుద్ధంలో అసలు వాళ్ళకే ప్రమాదమూ ఉండదు. నలిగి చచ్చేది పైవాళ్ళే. అంచేత ఇటు మన బ్రహ్మలోకానికిగాని, అటు కైలాసానికిగాని ఏమీ ప్రమాదం ఉండదు.

సర : ఈ యుద్ధం ఏమిటో చెప్పావు కావు.

నార: రెండుముక్కల్లో టూకీగాచెప్పేస్తా. అసలు సృష్టికీ లయానికీ మధ్య ఎప్పుడూ రంధి ఉండనే ఉంటుందిగదా. నాయనగారికి లయమంటే పడదు. పరమ శివుడికి సృష్టి అంటే పడదు. ఇద్దరూ కలుసుకున్నప్పుడు ఒహో అంటే ఓహో అనుకుంటారన్న మాటేగాని ఒకరి శక్తిని ఒకరు బేరీజు వేసుకుంటూనే వుంటారు—

సర : పోనిస్తూ. నువ్వెప్పుడూ తంపుల మారి మాటలే చెబుతావు. వాళ్ళిద్దరికీ చాలా స్నేహం.

నార : అదే రాజకీయ పరిజ్ఞానం లేక పోవటమంటే. అసలు విషయం మనవి చేస్తా. ఇటీవల నాయనగారిది బాగా పై చెయ్యి అయిపోయింది. జంతుబలులు మానేశారు. ఇరుగు పొరుగు వాళ్ళతో అస్తమానమూ యుద్ధాలు చేస్తూండాలన్న రాజధర్మం కాస్తా అడుగంటి చక్కాపోయింది. మహమ్మారి మొదలుకొని సమస్త పీడలకూ మందులు కనిపెట్టారు. ఆ మధ్య నాయనగారు భూలోకానికి వెళ్ళి అనేకరకాల బూజు పదార్థాలు సృష్టించి వచ్చెనే, వాటన్నిటినీ యాంటీ బయొటిక్స్ అనే పేరుతో మందులు తయారుచేసి అడ్డమైన రోగాలను నయం చేస్తున్నారు మానవులు. వాళ్ళ ఆయుర్దాయం పెరిగి పోతోంది. జనాభా విపరీతంగా పెరిగి భూభారం హెచ్చిపోతోంది. ఇంకేం? భూదేవి వెళ్ళి యమధర్మరాజుతో మొరబెట్టుకొన్నది. యమధర్మరాజు వెళ్ళి పరమశివుడితో చెప్పుకున్నాడు. ఓహో, బ్రహ్మ నన్ను సవాలు చేస్తున్నాడా? అనుకున్నాడు శివుడు.

సర : నేను నమ్మను.

నారా : నా రా య ణ. నే నెందుకు చెప్పటం? కంఠశోష.

సర : (గంభీరంగా) నేను నమ్మనన్నాను గాని, నిన్ను చెప్పొద్దనలేదు. చెప్పు.

నార : అప్పుడు పరమశివుడేం చేశాడూ చిచ్చర కన్ను తెరిచాడు. మారణాయుధాలు ఒకదాన్ని మించి ఒకటి తయారయాయి. ప్రపంచయుద్ధం వచ్చింది. జనం చచ్చారు. లక్షలకొద్దీ చచ్చారు. అది మొదటి ప్రపంచ యుద్ధం మాట. ఆ తరవాతే నాయనగారికి కోపంవచ్చి బూజు పదార్థాలు తయారుచేస్తా. మళ్లా జనాభా పెరిగింది. ఆయుర్దాయం పెరిగింది. పరమశివుడు మళ్ళీ మూడో కన్ను తెరిచాడు. మళ్ళీ మారణహోమం సాగింది. లక్షోప లక్షలు చచ్చారు. శివుడు తృప్తిచెందాడా? మళ్ళీ మళ్ళీ తనకు పని కలగకుండా మానవులకి పాశుపతాస్త్రం ఇచ్చేశాడు.

సర : పాశుపతాస్త్రమే?

నార: అహా, పాశుపతాస్త్రమే. దాన్ని వాళ్ళు అణుబాంబంటున్నారు. అది ప్రయోగించినచోట ప్రాణాలన్నీ తుడిచిపెట్టుకుపోతాయి. గడ్డి కూడా మిగలదు. అది సృష్టికే ఎసరు. నేను యీ మధ్య కైలాసం వెళ్ళినప్పుడు ప్రమథులు గుసగుస లాడుతూ నవ్వుకుంటున్నారు. ఏమిటి విశేషమంటే ఎవరూ చెప్పారుకాదు. ఒకడు తాగి కైపులో వున్నట్టున్నాడు... ఈ దెబ్బతో మీ బ్రహ్మ ఆటకట్టూ...అన్నాడు.

సర: వెధవా. అంత పొగరా?


నార: తల్లీ; నేను చెప్పానేగాని. నువ్వు నమ్మనవసరం లేదు.

సర: (ఆవేశంగా) ఆ తరువాత ఏం జరిగింది, నారదా? నువు విని ఊరుకున్నావా?

నార: నేనా ఊరుకునేది? నాయనగారితో అంతా చెప్పేశాను.

సర: ఆయన ఏమన్నారూ?

నార: నీలాగే మొదట్లో నామాటలు నమ్మలేదు, ఆ తరువాత అంతా నమ్మారు, పాశుపతాస్త్రానికి విరుగుడుగా ప్రజలలో ఒక ఉద్యమం బయలు దేరదీశారు. ఈ ఉద్యమం నిజంగా సఫలమయిందో పాశుపతాస్త్రాలన్నీ



హోటల్ గుమ్మంలో జారి పడబోయిన పెద్దమనిషి :— "ఏమిటయ్యా ఇక్కడ నీళ్లా?"

యజమాని : "మావాడు కాఫీ ఒలకబోసినట్టున్నాడు. రేయ్, ఇక్కడ క్లీన్ చెయ్!"

సముద్రంలో పారేస్తారు. పరమ శివుడి ఆట కట్టే.

సర: అంతేకావాలి. నా కళ్ళు చల్లగా ఉంటాయి.

నార: పరమశివుడి పక్షంవాళ్ల అంత అమాయకులా, తల్లీ? దేవలోకంలో యముడి ముఠావాళ్ళు యుక్తిగా నాయన గార్ని బుట్టలో వేసేసుకున్నారు.

సర: ఏమిటని? ఏమిటది?

నార: ఆయన్ని రాజకీయంగా గోతిలోకి దించేశారు. వాళ్ళ తెలివిమండా, ఆ గొయ్యి ఆయన చేతనే తవ్వించారు.

సర: (ఆందోళనతో) ఏమిటి? నారదా, నువ్వనేదీ?

నార: వాళ్లు ఒకనాడు నాయనగారి వద్దకు వచ్చి, ఏమన్నారంటే...

## (ఫ్లాష్ బాక్)

1: నమస్కారం పితామహా.

2: తాతగారూ. వందనాలు.

బ్రహ్మ: రండి. కూచోండి. దేవేంద్రుడు కుశలమా? దిక్పాలకులు సుఖంగా ఉన్నారా? మీరేం పనిమీద వచ్చినట్టు?

1: ఆ పరమేశ్వరుడి ప్రళయ యత్నాలు విఫలం చెయ్యడానికి మీరు సాగింపజేసిన ఉద్యమం మహత్తరమైనది. తమరికి అభివాదాలు చెప్పుకోవటానికి వచ్చాం.

బ్ర: పరమ శివుడిపై నాతో చాడీలు చెప్పకండి. నేను సహించను. అతను తన ధర్మాన్ని ఎన్నడూ మీరి నడవడు. మధ్యని ఈ మానవులే—

2: మానవుల దుర్బుద్ధి మీకు తెలియదా తాతగారూ? మీరు చక్రం అడ్డెయ్యకపోతే యీపాటికి భూలోకంలో నరపురుగు మిగిలి ఉండునా.?

బ్ర: (సంతోషంగా)ఏదోమరి. నాసృష్టిని నేను కాపాడుకోవాలిగద.?

1: మా భయమల్లా ఒక్కటే. పాశుపతాస్త్ర వ్యతిరేకోద్యమం సాగునా అన్నదే మా బెంగ.

2: ఎంచేతంటే. ఈ మానవులవి వొట్టి పుచ్చు బుద్ధులు.

బ్ర: అప్పటికీ మానవులు నాశనం అయిపోగోరితే నేను మాత్రం ఏం చెయ్యగలనూ? నాశనమైపోనీ.

1: బాగా శలవిచ్చారు. అసలు ఈ మానవులు వక్రసృష్టి అనే ఇటీవల దేవలోకంలో అందరూ అనుకుంటున్నారు. కాని పాశుపతాస్త్రంతో ఒక్క మానవులే పోతే అంత బెంగ పడనవసరం లేదు. తమరు కష్టపడి కృతయుగం నుంచీ చేసిన సృష్టి యావత్తూ నిర్మూలమై పోతుందే. ఏది దారీ అని మేం మహాదిగులు పడిపోతున్నాం.

2: ఆఁ దానిదేముంది? పాశుపతాస్త్రం కంటె నిపుణమైన అస్త్రాన్ని సృష్టిస్తేపోలా?

బ్ర: మరింత మారణం సాగటానికా?

1: ఛీ. ఛీ. అలాటిది తలవటానికైనా వీలుందా? ఇది సజీవాస్త్రం. దీన్ని సృష్టికర్త అయిన తమరే సృష్టించాలి. ఇది ప్రధానంగా మానవులనూ, వారి నాశ్రయించిన పశు పక్షి వృక్ష జాలాన్నీ నాశనం చేస్తుంది. తమరు మారణ క్రిములను సృష్టించండి. కొత్త వాటిని సృష్టించండి. పాత క్రిములకు విరుగుళ్ళున్నాయి. వీటితో మానవులంతా నాశనమయారనే అనుకున్నా, పాశుపతాస్త్రం మూలపడిపోతుంది.





2: తాతగారూ, మరో విషయం చూశారో లేదో, ఈ అస్త్ర ప్రయోగానికి సాధనలు అవసరం లేదు. చప్పుడు కాదు, అంతా నిశ్శబ్దంగా జరిగిపోతుంది.

బ్ర: అదంతా సరేగాని, మానవుడు పోతాడే?

1: ఏమండీ పోతేనూ? వెధవ మానవుడు. వీడు మీరు సృష్టించిన జంతువులన్నిటిలోకీ అధమాధముడు. వాడు నిర్మించిన నగరాలు చూడండి, అటు అరణ్యాలు చూడండి. ఇటు దుర్గంధం అటు నైర్మల్యం. ఇటు అశాంతి, అటు శాంతి. ఇటు అకారణ హింస అటు పరిమితమైన, అనివార్యమైన హింస. ఇటు ప్రకృతి నియమాల ఉల్లంఘన, అటు ప్రకృతి పరిపాలన.

2: బోడి మానవులు. భూలోకంలో ఇవాళ కూడా కీటకాలకుగల దక్షతలో వెయ్యోవంతు మనిషికిలేదు, మనుషులసంఖ్య కంటే వాటి సంఖ్య కొన్ని లక్షల రెట్లు.

బ్ర: ఆహా, నా కీటకాలు. అవంటే నాకెంత ఇష్టమో చెప్పలేను.

1: మరీ మంచిది. మనం ఈ మృత్యు క్రిములను కీటకాల ద్వారానే ప్రచారం చేస్తాం.

2: ఇంకెందు కాలస్యం? గొప్ప మేధావులలో అనుకూలంగా ఉండేవారిని మీరే ఎన్నుకొని క్రిమి సృష్టి సాగించండి. భూలోకంలో డబ్బు కోసం ఏం చెయ్యమన్నా చేసే మేధావులు కొందరున్నారు.

బ్ర: లేకపోతే సృష్టికి పాశుపతాస్త్ర ప్రమాదం ఉందంటారా?

1: ఇంకా సందేహమా?

2: మెల్లిగా అడుగుతున్నారా?

బ్ర: సరే, మీరు వెళ్ళండి. నే నీ విషయం కాస్త ఆలోచించుకోవాలి.

ఇద్దరు: నమస్కారం.... శలవు.

బ్ర: పోనీగదా అని చూస్తున్నకొద్దీ ఈ శివుడు మహా రెచ్చిపోతున్నాడు. ఇతగాడి ఆట కట్టించాలిసిందే.

• • •

సర: చూశావా, నారదా? ఇంత జరిగినా ఆయన నాతో మాటమాత్రం చెప్పారు కారు.

నార: ఆయన రాజకీయా లాయనవీ.

సర: (అనుమానంగా) అంటే?

నార: నారాయణ... ఉన్నదుండగా ఉపాకర్మ అన్నట్టు, ఆయనకు ఉన్న చిక్కులు గాక, కొత్తవి కూడా ఎక్కడ తెచ్చిపెట్టను?

సర: చిక్కులా?

నార: ఆయన గుట్టు నీకు చెప్పేస్తాను.

## ఆ లోకం

కొత్తగా వచ్చినవాణ్ణి కళ్లజోడులోంచి పరీక్షగా చూస్తూ చిత్రగుప్తుడు అన్నాడు : "మీ పేరేమిటన్నారు? మళ్లీ చెప్పండి."

ఆగంతుకుడు మళ్లీ పేరు చెప్పాడు.

చిత్రగుప్తుడు చిఠా పుస్తకం తిరగేసి చూసి "కాస్త తొందరపడ్డారు. 1965 దాకా మీకు టైముంది. ఎవరక్కడ మీ డాక్టరు?" అన్నాడు.

నువ్వాయనను నాలుగూ అడగకుండా ఊరుకుంటావా, తల్లీ?

సర: నన్ను గురించిన రహస్యాలే నాదగ్గర దాస్తున్నావా, నారదా? ఇదేనా నీ మాతృభక్తి?

నార: మాతృభక్తికోసం మీ కిద్దరికీ కీచులాట తెచ్చిపెట్టనా? నావల్లకాదు. అసలే కలహభోక్త అని నన్నందరూ ఆడిపోసుకుంటున్నారు. దయచేసి నన్నేమీ అడగవద్దు.

సర: (అధికారంగా) చెప్పితీరాలి. నీ మనస్సులో ఉన్నదేదో చెప్పక పోయావో, నిన్ను ఘోరంగా శపిస్తాను.

నార: శాపంకూడా ఎందుకు తల్లీ? నీ అజ్ఞ చాలదా? నేను పుట్ట రేపెట్టానని తరవాత నన్ను నిష్ఠురాలు మాత్రం ఆడవద్దు. కాకపోయినా ఇందులో పెద్దరహస్యం కూడా ఏమీ లేదు. కొంచెం ఆలోచిస్తే నాయనగారు మీకు చేస్తూ వస్తున్న అన్యాయం మీకే తెలుస్తుంది.

సర: (ఆశ్చర్యంతో) నాకు అన్యాయం చేశారా? ఎలాగ?

నార: సృష్టికర్త అని ఆయనని మూడు లోకాలూ తెగ పొగడేస్తాయిగదా, ఏమిటండీ ఆయన చేసిన సృష్టి? చెదలూ, పొదలూ, చెట్లూ, చీమలూ, దోమలూ, తొండలూ, కప్పలూ, తేళ్లూ—ఇవేగా? రెండు కాళ్ళమీద పరిగెత్తే తోకలేని కోతులకన్న గొప్ప జంతువును ఆయన సృష్టించగలిగాడాంట.

సర: మానవుల మాటో.

నార: మానవులు ఆయన సృష్టి ఎలాగయిందో, మనిషికి నువు వాక్కిచ్చావు. దానితోనే వేదాలూ, శాస్త్రాలూ, పురాణాలూ, సమస్త కళలూ, నాగరికతా, మహానగరాలూ, ధర్మాలూ, నీతులూ, తత్వజ్ఞానమూ భూలోకంలో అవతరించాయి. ఇదంతా తన గొప్పేనంటాడా పిచ్చి బ్రాహ్మడు.

సర: (ఒకపక్క సంతోషపడుతూనే) అన్యాయం మాట లనకు. సృష్టికి నేను చేసిన సహాయం ఆయన ఎన్నడూ కాదనలేదు.

నార: తల్లీ, నీకు తృప్తి కలిగితే యిక నాకు కావలిసిం దేముంది? ఈసంగతి ఇంతటితో వదిలేద్దాం.

సర: కాదు, కాదు ఇంకేదో దాస్తున్నావు.

నార: సర్వజ్ఞురాలివి, నీ దగ్గి రేమిటి, నేనేమిటి, దాచట మేమిటి?

సర: (ఆగ్రహంతో) చెబుతావా, చెప్పవా?

నార: చెప్పేటందు కేముంది, తల్లీ కళ్ళు తెరిచిచూడు. నీకే తెలుస్తుంది. నాయనగారు మానవులికి ఇతర ప్రాణులతో బాటు జంతు ధర్మాలన్నీ ప్రసాదించారు. వాటికి లోబడి మానవుడు శరీరపోషణా, ఆత్మరక్షణా చేసుకుంటున్నాడు. సంతానాన్ని కంటున్నాడు. కాని నువ్విచ్చిన వాక్కు ఏమయింది? దాని ధర్మం ఏమైనా అమలు జరుగుతున్నదా?

సర: (ఆశ్చర్యంగా) అదేమిటి, నారదా? భూలోకంలో బళ్ళకు బళ్ళు సాహిత్యం తయారవుతున్నదనరూ? అవి పత్రికలుకావుట, పుస్తకాలుకావుట, నాటకాలుట, శ్రవ్య నాటకాలుట! సినిమాలుట, ఇంకేవేవోట.





నార: నారాయణ... పిచ్చితల్లీ, అందులో నిజమైన సారస్వతం లేదు. వేదాలు అడుగంటాయి. పురాణాలన్నీ మార్చేశారు. సినిమాలలో పురాణకథ లుంటున్నాయిగదా- చూస్తే నిర్ఘాంతపోతావు. అసలు సంగతి అదికాదు! మనిషి మాటకు విలువలేదు. పసలేదు. మొండి కత్తికైనా అంతో యింతో బలమూ, పదునూ ఉంటుందిగాని, మనిషిమాట చొప్పదంటు, మానవుల జంతుకర్మలకన్నిటికీ ఫలితం ఉంటుందిగాని, వాక్కుకు ఏమీ ఫలితం లేదు.

సర: మానవులలో అమోఘ వచస్కులు లేరూ?


నార: పూర్వం ఉండేవాళ్లు—మహామునులు, అదైనా వాళ్ళు తమ స్వశక్తిచేత సంపాదించుకున్న శక్తి, జన్మతహా వచ్చింది కానేకాదు... అవునుగాని, తల్లీ, నాయనగారు మానవులకు తానిచ్చిన శక్తులన్నీ సార్థకం చేసి, నువ్విచ్చిన వాక్కును ఎందుకు నిరర్థకం చేశారో కాస్త ఆలోచించావా?

సర: (కోపంతో) అదే ఆలోచిస్తున్నాను నారదా, ఆయన్ని రానీ చెబుతాను.

నార: నారాయణ... కొంపమునిగింది. చిన్నవాణ్ణయినా నామాట ఒక్కటీ ఆలకించు తల్లీ. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న తీరుగా అంతా మించిపోయాక ఇప్పుడాయనతో కలహం దేనికి? మానవుడు నశించటానికి అన్ని ఏర్పాట్లూ ఈ సరికి అయే పోయాయి. ఆకాస్త పీడా విరగడయాక ఆయనగారు మళ్ళీ కోతుల్నీ, కొండముచ్చుల్నీ చేసి చెట్లపైన వదిలేస్తాడు. నువ్వయినా మళ్లా ప్రాణులకు వాక్కు ప్రసాదిస్తావు గనకనా? మహాసృష్టిలో ఒక అధ్యాయం ముగియబోతున్నది. నా విచారమల్లా నీ మహత్తరమైన కృషి యావత్తూ నీరుకారిపో బోతోందే అనే. హుం.

సర: అశుభాలు పలక్కు, నారదా, నువ్వన్నట్టు మానవులు నశించరు. నశించటానికి వీల్లేదు. నశించనివ్వను. పైపెచ్చు మానవులకు సార్థక వాక్కుకూడా ఇప్పిస్తాను. నన్ను బొత్తిగా అసమర్థురాలి కింద కట్టకు. (దురుసుగా వీణావాయిద్యం)

---



*సర్వారేశ్వారుడు కాఫీ తీసుకొస్తూ ఇంకా రెండుగజాల దూరంలోవుండగానే "ఇంకా వేడిగా కావాలి" అన్నాడు ఆసామీ. సర్వార్ మళ్లీ వెచ్చచేసి తెస్తుంటే "ఇంకా వేడిగా" అన్నాడు. ఇలా నాలుగుసార్లు జరిగాక సర్వార్‌కు వళ్లు మండి "ఏమిటయ్యా, కాఫీ తాకకుండానే వేడిలేదంటావు." అన్నాడు.*

*"నేనుకూడా తాకాలా? నువ్వు వేలెట్టి తెస్తున్నావుగా. దాంట్లో వేలు పెట్టలేనంత వేడిగా కావాలి." అన్నాడు ఆసామీ.*

నార : నారాయణ.... నారాయణ.... మళ్ళీ కనిపిస్తాలే తల్లీ.

• • •

(వైకుంఠం)

విష్ణు : వీళ్ళకేదో పెద్ద సమస్యే వచ్చి పడ్డట్టుంది. బ్రహ్మను వెంటబెట్టుకుని దిక్పాలకు లంతా వస్తున్నట్టు కబురు పంపారు.

లక్ష్మి : వాళ్ళ కెప్పుడూ సమస్యలే. మీరు మళ్ళీ ఇంకో అవతారం ఎత్తకండి. మీ పుణ్యం వుంటుంది.

విష్ణు : అందరూ చేరి బలవంతం చేస్తే తప్పుతుందా ? అయినా ఈసారి అంత గండక త్తెర వస్తుందనుకోను. ఈ మధ్య నారదుడైనా వచ్చాడు కాడు — లోకాల వార్తలు బొత్తిగా తెలియటంలేదు.

నార : నారాయణ.... నారాయణ....

లక్ష్మి : అడుగో. మాటలోనే వచ్చాడు. ఏం. నారదా ? యీసారి ఎవరి కొంప కూల్చబోతున్నావు ?

నార : నారాయణ .... నారాయణ.... ఆది దంపతులకు నమస్కారం.

విష్ణు : కూచో నారదా. ఏమిటి వార్తలు? ఎక్కణ్ణుంచి రావడం ?

నార : తిరిగే కాలాయె. పద్నాలుగులోకాలూ చుట్టి మరీ వస్తున్నా. ఇక్కడికి వస్తే అన్ని లోకాల వార్తలూ అడుగుతారాయె.

విష్ణు : బ్రహ్మ వెంట దిక్పాలకులందరూ వస్తున్నారట. నన్ను చూడటానికి. కారణం ఏమై వుంటుందో చెప్పగలవా ?

నార : ఊఁ .... మీ సలహాకోసమై ఉంటుంది.

విష్ణు : మాట నాన్చకు. దేన్నిగురించి నా సలహా కావాలి ?

దేవతలు : (దూరంనుంచి జయధ్వానాలు) జై వైకుంఠవాసా ... జై లక్ష్మీపతీ .... జై రమారమణా ....... (చివర ఒక గొంతు గోవిందా గోవింద-అంటుంది....

విష్ణు : రండి రండి. అంతా కూచోండి. మీ మాటే అనుకుంటున్నాం.

దేవేం : నువ్విక్కడే వున్నావా, బాబూ?

నార : శుభమస్తు దేవేంద్రా.

దేవేం : తథాస్తు.

నార : నువుగాని అశుభం శంకించటం లేదుగద ?

దేవేం : అశుభమని మెల్లిగా అడుగుతున్నావా, నారదా. లోకాలన్నీ తల్లకిందులయ్యే పరిస్థితి ఏర్పడబోతున్నది.

నార : అదేం ?

దేవేం : మళ్ళీ నానోట చెప్పించటం దేనికి ? అంతా తాతగారే చెబుతారు,

బ్ర : (గొంతు సవరించుకుని) దేవేశా, పెద్ద సమస్య వచ్చి పడింది.

విష్ణు : ఏమిటది ?

బ్ర : మానవులకు అమోఘ వచనం ఇవ్వమని సరస్వతి పట్టుబట్టి కూచుంది. వారి వాక్కు నిరుపయోగంగా ఉంటోందట. భూలోకంలో ఉండే ప్రతి మనిషీ నోటంట ఏమంటే అదల్లా జరిగితీరాలట. ఇప్పు డలా జరగకపోవటం తనకు తీరని అవమానంగా వుందట.

దేవేం : తపశ్శక్తి సంపాదించుకునే వాళ్ళతోనే వేగలేక చచ్చాను. మనిషికి యీ వరం వచ్చిందో ప్రతిమనిషీ ఒక అగస్త్యుడూ, చ్యవనుడూ అయి కూచుంటాడు. తలుచుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తున్నది.

విష్ణు : ఆమెకు అకస్మాత్తుగా ఇలాటి ఆలోచన ఎందుకు కలిగిందీ ?

లక్ష్మి : ఆమె మొదటినుంచీ అదొక రకం వ్యక్తి.

బ్ర : మీ ఆడవాళ్ళ సూటిపోటీల కిది సమయం కాదు. నన్నడిగితే యిది చాలా క్లిష్టమైన సమస్య. ఆవిడ కీ ఆలోచన ఎవరు చెప్పా రనేది కూడా—

దేవేం : ఎవరో తంపులమారివాడు చెప్పి వుంటాడు.

నార : నారాయణ .... నారాయణ .... నన్నేనా అంతమా టంటున్నారు దేవేంద్రుడు గారు.

దేవేం : పుచ్చకాయల దొంగంటే భుజాలు తడువుకున్నట్టుగా—

నార : నాలుగు లోకాలూ తిరిగి వచ్చే వాణ్ణి నా కాపాటి వ్యంగ్యం అర్థం కాదా, దేవేంద్రా ? మా తల్లిగారి ఆలోచన నేను విన్నప్పు డేమని సలహాయిచ్చానో అడగండి. మానవ జాతే తుడిచిపెట్టుకుపోనున్న సమయంలో వాళ్ళ కీ సార్థక వాక్కు కూడా దేనికి తల్లీ అన్నాను. నా మా టెవరూ వినరు. పైపెచ్చు నాకు తేనిపోని ప్రవాదాలు అంటగడతారు.

విష్ణు : మానవజాతి అంతరించిపోవట మేమిటి ? ఈమాట ఎలా పుట్టింది ?

నార : మీ రింకా వినలేదా. దేవదేవా ? భూలోకంలో వుండే సమస్త ప్రాణికోటినీ అయిదుసార్లు నాశనం చెయ్యటానికి తగినన్ని పాశుపతాస్త్రాలు గోదాముల్లో బుసలుకొడుతున్నాయి. ఒకవేళ ఒకరూ అరా మనుషులు మిగిలిపోతారేమోనని నాయనగారు ఇటీవలే మృత్యు క్రిములను సృష్టించి మానవుల కిచ్చారు.

విష్ణు : ఇది నిజమేనా బ్రహ్మ ?

బ్ర : వాడిమాటలు నమ్ముతా రేమిటి మీరు కూడాను. ఆ పాశుపతాస్త్రాలను నిర్వీర్యం చెయ్యటానికే యీ క్రిములు సృష్టించాను. మానవులు పోతే పోతారు మరి. సృష్టి మొదలంట నాశనం కాకుండావుంటే, మానవుల జేజెల్లాటి ప్రాణులను సృష్టిస్తాను, ఇలా ఎన్ని జాతులు పోయాయికావు ? వాటి స్థానంలో ఇంకా మంచి ప్రాణులను సృష్టించాను కానా ?

విష్ణు : జగద్రక్షకుణ్ణి నేనొకణ్ణి వున్నానని ఆలోచించకుండా సృష్టితోనూ, లయంతోనూ యిలా ఆటలాడుకుంటున్నారా ?

నార : మీ రామాట అన్నారుగనక తల్లిగారిని సమర్థిస్తూ ఒక్క ముక్క నన్ను చెప్పనిస్తారా ?

బ్ర : (కోపంగా) చెప్పు. మేమంతా ఆవిడ శత్రువులమనా నీ వుద్దేశం ?

## జోగీ జోగీ

ఒక సన్యాసి : మనం పుట్టడమే దురదృష్టం. పుట్టకుండావుంటే ఎంత బావుండేది.

మరో సన్యాసి: బావుందయ్యోవ్. అంత అదృష్టానికి పెట్టి పుట్టద్దూ?

నార : అలా అనుకుంటే నే నసలు నోరే మెదపకపోదును. నే ననేదల్లా ఏమి టంటే, మానవు లంతా పోయాక నాయన గారు మరొక జంతువును సృష్టించినా తల్లి గారు వాక్కు ప్రసాదించకపోతే అది రాణిం చడం కల్ల. ఒప్పుకుంటారా ?

బ్ర : మాటవరసకు ఔనే అనుకుందాం. అయితే నువ్వనే దేమిటీ ?

నార : మనిషికి వాక్కు యిచ్చి కూడా నిష్ప్రయోజనమైపోయిందిగద. మానవ మారణానికి మన మంతా ఇంచుమించు ఆమో దించి నంతదాకా వచ్చాంగద, రేపు సృష్టించ బోయే జంతువుకైనా అమోఘవచనం లేక పోతే ఆ జంతువు గతీ యింతేగద. అలా టప్పుడు తల్లి గారి కోరిక పాటించి ఈ మాన వులు అంతరించకముందే అమోఘవాక్కు యిచ్చి చూడకూడదూ ?

దేవేం : (ఆర్భాటంగా) అలా జరిగితే నేను ఇంద్రత్వం క్షణం కూడా నిర్వహించ లేను. ఈ పదవి మరెవరికన్నా ఇవ్వండి.

యమ : ఇక యమత్వం నా వల్లకాదు. అసలు యముడి పదవి ఎత్తే పారెయ్యొచ్చు. చూస్తూ చూస్తూ ఏ ప్రాణీ చావు కోరదు. చావకుండా మానవులు తమను తాము చిరం జీవీ అని జీవించుకోగల స్థితిలో వుంటే ఇంక నాకు పనేముంటుంది ? మహాను భావులు, కోరి మరణించేవారు బహుకొద్ది మంది వుండేవారు. ఆఖరుకు జపానులో కూడా స్వచ్ఛంద మరణాలు పోతున్నాయి, సకృతుగా ఆకలి చావు లుంటున్నాయి. కాని నూటికి తొంభైతొమ్మిదిపాళ్ళు నేను బలవంతాన ప్రాణాలు తీయటమేగద. ఇం కేం ? మనిషికి అమోఘ వాక్కు ఇచ్చె య్యండి, నా బెడద తీరిపోతుంది. భూభారం ఎక్కువైతే ఆ సంగతి చూడటానికి దేవ దేవు డుండనే వున్నాడు.

విష్ణు : మీరంతా కాస్త తగ్గండి. నార దుడు చెప్పినమాట కొట్టివెయ్యటానికి లేదు. మీ అందరిమాటా తోసేసి మానవులకు అమోఘ వాక్కు ఇచ్చేద్దామని నేను అన లేదు. లోకాలను శాసించే మనం ఏదిచేసినా నియమబద్ధంగా చెయ్యాలి. ముందు ఒక్క మానవుడికి అమోఘవాక్కు ఇచ్చి చూస్తాం. సరస్వతే ఆ మనిషిని ఏరుకుంటుంది. అందువల్ల లోక కల్యాణం జరిగేటట్టు మనకు నమ్మకం కుదిరితే మానవుల కందరికీ అమోఘవాక్కు ఇచ్చేద్దాం. లేదూ, ఇచ్చిన దాన్నే ఉపసంహరించుకుందాం. ఏమం టారు ?

(అంతా తలా ఒక మాటగా..."భేషుగ్గా ఉంది, ఇదే సరయిన ఆలోచన... అలాగే చేద్దాం ... దీని ఫలితం క్షణంలో తేలిపోతుంది"...)

బ్ర : చూస్తూ వుండండి, సరస్వతే తన కోరిక ఉపసంహరించుకుంటుంది.

• • •

(భూ లో క ం)

సర : ఇదుగో చూడండి. నేను ఎన్ను కున్నవాడు వుండేది ఈ యింట్లోనే.

లక్ష్మి : (నిరసనగా) ఇల్లా ? ఛిఛిఛీ... గొడ్లపాక నయం. వెయ్యేళ్లు నన్ను అర్చిం చినా ఇలాటి చోట అడుగు పెట్టను.

సర: అది నీ సంస్కారం. ఎవరేం



చేస్తారు? పరమ నీచుల ఇళ్ళలోకి తొంగి చూసే దానివి నీకు మనుషుల విలువ ఏం తెలుస్తుంది. ఈ యింట్లో ఉండేవాడు పరమ నైష్ఠికుడు. నీతిపరుడు. సమస్త వేదాలూ, శాస్త్రాలూ చదివినవాడు. మనుషులలో మాణిక్యంలాంటి వాడు. ఒక్క మానవుణ్ణే ఎన్నుకోమంటే ఎంత కష్టమవుతుందో అని భయపడ్డాను. ఈ భూలోకంలో నాకు నిజంగా నచ్చినవాడు ఒక్కడే ఒక్కడు న్నాడు అతనే యితను.

లక్ష్మి: అది నీ అభిరుచి. ఎవరేం చేస్తారు?

బ్ర: (చిరాకుగా) మీ ఆడవాళ్ళ కీచులాట ఇప్పుడే సాగాలా?

సర: లోపలికి పోదాం పదండి... అడుగో, అ నిద్రపోతున్న వాడికే మనం వరం ఇవ్వవలసింది. అవతల పడుకున్న ఆయన భార్య. చూడండి మెళ్ళో పసుపు కొమ్ముతప్ప ఇంకేమీ లేదు. ఆ నలుగురూ వాళ్ళ పిల్లలు, వాళ్లు దిసమొలలతో ఉండటాని క్కారణం ఉక్కకాదు.

లక్ష్మి: నేనిక్కడ ఒక్కక్షణం ఉండ లేను. త్వరగా మీరంతా బయటికి రండి. నే పోతున్నా.

సర: (నిరసనగా) హుం. మొగుళ్ల ఎలా తయారుచేస్తే పెళ్లాలలా తయారవుతారు.

బ్ర: నీకసి తరవాత తీర్చుకుందువుగాని ముందు పని జరగనీ.

సర: మీరు నాతో మాట్లాడకండసలు. మీ మూలానే ఇదంతా వచ్చిపడింది. (కసిగా) సృ-ష్టి-కర్త.



"ఇంతా ఏం కావాలి సార్— దోసె, పూరీ— —"

"ఇం కేం వద్దుగాని ఓ లడ్డూ తీసుకురా కాస్త పెద్దది చూసి. ఇందాక నువ్వు తెచ్చిన ఇడ్లీన్ గాలి కెగిరిపోయినట్టుంది."

దేవేం: ఆగ్రహించక మా కర్తవ్యం తెలియబరచండి.

సర: ఇంకా తెలియ బరిచే దేముంది. యీ బ్రాహ్మడి పేరు శివావధాని—

బ్ర: ఆ పేరే దొరికిందా?

సర: మీ మగవాళ్ళ కీచులాటలతో నాకు పనిలేదు. ఈ బ్రాహ్మడికి అమోఘవాక్కు ప్రసాదించండి. అందరూ కలసి వరమి వ్వండి.

విష్ణు: శివావధానికి అమోఘ వాక్కు కలుగు గాక.

అంతా: తథాస్తు.

శివావ: (ఉలిక్కిపడి లేచి) నిజమా, కలా? నాకు కనబడింది మానవులు కారు. దేవతలే, ఏరీ, ఏమయారూ?

నార: అందరమూ యిక్కడే వున్నాం. నాయనా. ఇక చూపించు నీ ప్రతాపం.

శివావ: ఏమిటి నాలో యీ మార్పు... అందరూ నిద్రపోతున్నారు. వేళ ఎంత అయిందో. ఛీ ఛీ. ఏం కొంప. ఎంత దారి

ద్ర్యం. నా కుచేల సంతానం. డబ్బు...డబ్బు... కొన్ని కొంపల్లో లక్ష్మి తాండవిస్తుందంటారు. లక్ష్మి ఎక్కడుంది? లక్ష్మిలేదు-డబ్బే వుంది.

నార: కొంప మునిగింది. బయటికి పోదాం పదండి.... ఏదీ లక్ష్మిదేవి?

సర: మనని బెదరగొట్టటానికి ఎక్కడో దాగి వుంటుంది, సంగనాచి.

నార: తల్లీ, నువ్విచ్చిన వరంలో నీకే నమ్మకం లేదా?

విష్ణు: (ఆదుర్దాగా) లక్ష్మి...ఓలక్ష్మి.... నా నోటిమీదుగా ఇచ్చిన వరం ముందు నాకే ఎసరు తెచ్చింది.

దేవేం: ఇంతలో అయిందా, దేవదేవా? సూర్యోదయమయ్యే లోపల యీ బ్రాహ్మడు మనందరినీ మాయం చేస్తాడు. చూస్తూండండి. ఇది కూడని పని అని నేను మొదటి నుంచీ నెత్తీనోరూ కొట్టుకుని చెబుతూనే వున్నాను. నా మాటెవరు వింటారు?

సర: నువ్వూరుకోవయ్యా. ఇంతమంది పిరికివాళ్ళను చూశానుగాని నీ అంత పిరికి పందను ఎక్కడా చూడలేదు.

దేవేం: చేసేదేదో చేసేసి మధ్య నా మీద పడటం దేనికీ?

విష్ణు: లక్ష్మి... లక్ష్మి...

సర: మగవాడి కింతగా పెళ్లాం కొంగు పట్టుకు తిరగటం భావ్యంకాదు.

దేవేం: పెళ్లామే లేకపోతే ఇంకా కొంగెక్కడ?

సర: (రుసరుసలాడుతూ) అంతా నాకు శత్రువులే. నేను పోతున్నాను.

బ్ర: మనంకూడా పోదాం. ఇంకా ఇక్కడ మనకేం పని?

అంతా: పదండి...పదండి.

శివా: ఇక నేనీ జీవితంతో సరిపెట్టుకోను. ఏదో చేస్తాను. చేసితీరుతాను.

(గట్టిగా) ఎవరడ్డొస్తారో చూస్తాను.

భార్య: (ఉలికిపడి లేస్తూ) ఏమిటండీ ఆ చప్పుడూ?...ఎవరో కేకలు పెట్టారే.

శివా: నేనేలే.

భార్య: మీరేనా?...అయితే, చూడండీ నాకో కల వచ్చిందిగదా, ఎంత మంచి కలో చెప్పలేను. మనింటికి దేవతలంతా వచ్చారు.

శివా: ఓసి నీయిల్లు బంగారంగానూ, నీక్కూడా అదే కల వచ్చిందా?

భార్య: (కెవ్వున అరిచి) గోడలన్నీ అంటుకున్నాయండీ. బయటికి పోదాం పదండి. పిల్లలు, అయ్యో, నా పిల్లలు... (శోకాలు పెడుతుంది)

శివా: ఊరుకోవే. మంటలైతే వేడి ఉండదూ. గోడలంతా బంగారమయాయి.... అదుగో కప్పుకూడా....ఇల్లంతా ఎలా మారిపోయిందో చూశావా? లక్ష్మి లేదనుకున్నాను. లేకేం? ఉంది. నా యింటికి వచ్చింది,

లక్ష్మి: ఇప్పుడీయిల్లు బాగుంది.... వీళ్ళంతా ఏరీ? నన్నొక్కత్తెనూ విడిచి వెళ్ళిపోయారే?

శివా: మనకు వచ్చిన కలేనే, నిజంగానే దేవతలు మనింటికొచ్చారు. మనిల్లు బంగారమయింది. నిజంగా బంగారమయింది. నిజంగా బంగారమయింది. నిజంగా...నిజంగా...





• • •

విష్ణు: వచ్చావా, లక్ష్మి, నిజంగా వచ్చావా? నిన్ను మళ్లా చూడననుకున్నాను.

లక్ష్మి: అదిసరేగానీ. నన్ను ఒక్కత్తెనూ విడిచి మీరంతా వచ్చేశారేం?

విష్ణు: నువు ఎంత పిలిచినా పలకందే.

నార: నారాయణ....నారాయణ....

లక్ష్మి: మీకోసం యింటి బయట ఎంతో సేపు కనిపెట్టుకున్నానా, ఆ తరువాత అకస్మాత్తుగా ఇల్లూ, సమస్తమూ మాయమయింది. నాకు స్పృహలేకుండా పోయినట్టయింది. ఇంతలో ఎలా వచ్చానో నేనా బ్రాహ్మడి ఇంటో ఉన్నాను. అన్నట్టా యిల్లిప్పుడు ఎంత బాగుందనుకున్నారు.

నార: నారాయణ...నారాయణ...

• • •

జనం కోలాహలం. ఇద్దరు మనుషులు మాట్లాడుకుంటూ వుంటారు. మధ్యమధ్య శివావధాని గొంతు వినిపిస్తూంటుంది.

1: అదేం విడ్డూరమండీ? లంకలో బంగారు మేడలున్నట్టు వాల్మీకిగారు రాశారని వినటమేగాని, బంగారపు గుడిసెలు ఎక్కడా వినలేదు.

2: ప్రత్యక్షంగా చూస్తూంటే యింకా వినటంకూడా దేనికీ?

3: ఇందులో ఏదో కనుకట్టుందిలెండి. అదంతా గిల్టయి ఉంటుంది.

శివా: (కేకలుపెడుతూ)ఏమిటీ తిరణాల?

చూడండి. బాగా చూడండి. కావలిస్తే తలా కాస్త బంగారమూ తవ్వుకుపొండి.

2: ఆ బ్రాహ్మడి దరిద్రం తీరిపోయింది.

రిపోర్టర్ (టెలిఫోన్) హలో హలో... బంగారపు గుడిసె వార్త అక్షరాలా నిజం... కళ్ళారా చూశా...గీటు రాళ్ళమీద పరీక్షించారు...మేలిమి బంగారు... బంగారు గుడిసె ప్రభుత్వానికి చెందుతుందని ఒక న్యాయవాది అంటున్నాడు .... అవునవును ద్రవ్యోల్బణం...బంగారు ధర పడిపోతుందన్నారు. ...ఇల్లుగలాయనా? నిరుపేద బ్రాహ్మడు...తపస్సంపన్నుడని కొందరూ నీచోపాసనలు చేసి పరుసవేది సాధించాడని కొందరు అంటున్నారు...ఇంటిచుట్టూ ఇసక వేస్తే రాలని జనం...హలో.హలో....

• • •

దూత: దేవేంద్రా. శివావధాని తన శక్తులను గ్రహించాడు. తాగిన వాడులా అయిపోయాడు. చుట్టుప్రక్కల అందరినీ చంపి బతికిస్తున్నాడు, ఇళ్ళు తగలబెట్టి మళ్ళీ ఎప్పటిలాగా చేస్తున్నాడు. జనం అతన్నిచూసి దడుచుకుని పారిపోతున్నారు. ప్రభుత్వం పోలీసులను పంపింది. వాళ్ళందరినీ శిలలుగా చేసేశాడు. వెర్రికేకలు వేస్తూ, వికటాట్టహాసాలు చేస్తున్నాడు.

శివా: హహహహ....నాజోలి కెవరన్నా వస్తే మాయం చేస్తా, నన్నెవరూ ఏమీ చెయ్యలేరు. నేనే దేవుణ్ణి. లోకాలన్నీ నావే. ఇంద్రుడి సింహాసనంమీద కూచుని మూడు లోకాలూ ఏలుతా. హహహహ... హహహహ....

• • •

దేవేం: దేవదేవా, మాకేం దిక్కు? ఇంతమంది రాక్షసుల బారిన పడ్డానుగాని,

ఇంత ప్రమాదం నే నెన్నడూ ఎదుర్కో లేదు. నహుషుడు పాలుతాగే పిల్లవాడే నన్న మాట. ఇంత బెదడ ఎన్నడూ ఎరగం.

విష్ణు : ఏం నారదా, ఏమిటి నీ సలహా ? ఇదంతా నీ కల్పనేగద.

నార : నారాయణ...నారాయణ.... నేనే పాపమూ ఎరగను. అయినా, తమ సెల వైతే యీ కొత్త దేవేంద్రుణ్ణి ఒక్కసారి చూసి వస్తా.

దేవేం : వట్టి చేతులతో రాకు, నీకు పుణ్యం ఉంటుంది.

• • •

నార : నవ దేవేంద్రా, నమస్తే.

శివా : నువ్వెవరు ?

నార : నన్ను నారదుడంటారు, ఇలా వెళుతూ నా అభినందనలు తెలపటానికి వచ్చాను. నే పుట్టి పెరిగాక ఎందరో తప శ్శక్తి సంపన్నులను చూశానుగాని నీవంటి మహత్తర శక్తిమంతుణ్ణి చూడలేదు, వాక్శక్తి ముందు ఏ యితర శక్తులూ నిలవ లేవని త్రిమూర్తులు గుర్తించారు. నీవు సాక్షాత్తూ మహేశ్వరావతారమేనని వారం టున్నారు.

శివా : వాళ్ళ ఎన్నిక ఎవడికొ్కావాలి. బోడి ఎన్నిక.

నార : నువు సంతోషిస్తావని చెప్పలేదు నాయనా. అసలు విషయం విను, నీకు అమోఘ వాక్కిచ్చిన సరస్వతీదేవి ఇదే శక్తిని నీ భార్యకు్కూడా యివ్వటానికి బ్రహ్మలోకంనుంచి నాతోబాటే బయలు దేరింది.

శివా : (ఆదుర్దాగా) వొద్దు, వొద్దు. అది వట్టి అమాయకురాలు. మహా పుణ్యాత్మ రాలు. అది కాస్తా రాక్షసి అయిపోతుంది:

నార : అదేమోగాని మీ ఇద్దరికీ పోటీ పెట్టి దేవతలు సంతోషించటానికి ఆలో చిస్తున్నారు. ముందే చెప్పాను, తరవాత నీయిష్టం.

శివా : ఘోరం .... ఘోరం ... దానికి వాక్శక్తి యివ్వవద్దు. నాకూ వద్దీ పాపిష్టి శక్తి.

(దగ్గరలో పిడుగు పడిన చప్పుడు)

శివా : ఏమిటా చప్పుడూ ? ఎక్కడో పిడుగుపడ్డట్టుంది. ఇదేమిటి ? నే నెక్క డున్నానూ ? స్వర్గమేదీ ? నారదుడేడీ ?... ఇది నా గుడిసే. అదుగో మా ఆవిడ. (కోడికూత) తెల్లవారబోతున్నది. అంతా కలేనన్నమాట. నిజమైతే ఎంతబాగుండేదీ ? (ఆ లో చిం చి) హుం. పో ని స్తూ, పీడకలా. ●

---

● "మీ కొచ్చిన జబ్బుంది చూశారూ. సాధారణంగా అది నయంకాదు. మీ అదృష్టం కొద్దీ అది నయమైంది" అన్నాడు డాక్టరు.

"బిల్లు యిచ్చేటప్పుడు కాస్త ఆ ముక్క జ్ఞాపకం వుంచుకోండి", అన్నాడు రోగి.

# మీ పద్యాటోపం

అల్లము కారముండ దిల
ఆకకు అంతము కద్దు
చీకటిన్ పిల్లికి చూపు లేదు
వరి బియ్యము మాకులయందు తీయనా
బెల్లము చేదు మానదు
ఇల వేము సుధానిధి
చందమామ బల్ నల్లగనుండు
కోయిల వనమ్ముల నుండు కిరాత జాతియే!

ఆచార్య ఆత్రేయ

అల్లము కారము
(పు)ండ దిల ఆకకు అంతము
కద్దు చీకటిన్ పిల్లికి చూపు
లేదు వరి బియ్యము మాకులయందు
తీయనా బెల్లము
చేదు మాన దిల వేము
సుధానిధి చందమామ
బల్ నల్లగ నుండు కోయిల
వనమ్ముల నుండు కిరాత జాతియే!